* మినీ కథ *

# టు - ఇన్ - వన్

గూడూరు శ్రీనివాస్

"రెండ్రోజులుగా రామ్మూర్తి ఆఫీసుకు రావడం లేదు"- విసుక్కున్నాడు సీతాపతి.

"రామ్మూర్తి లేకపోతే చేయి విరిగినట్టే వుందయ్యా"- శ్రీపతితో అన్నాడు.

కాదు మరీ! మేనేజరు సిగరెట్ల దగ్గర్నుండి రీజినలాఫీసుకు పంపాల్సిన ఫైళ్ల వరకు బ్రాంచిలో పనిని నిర్వహించగల సమర్థుడు రామ్మూర్తి. తన పదిహేనేళ్ల బ్రాంచి జీవితంలో సేవింగ్స్ బాంక్ కౌంటర్ వర్కు నుంచి 'పి' రిపోర్టు తయారు చేయడం వరకు అన్ని పనులను క్షుణ్ణంగా నేర్చుకున్నాడు. కొత్తగా అపాయింటయిన ఆఫీసర్లు, క్లర్కులకు రామ్మూర్తే కోచ్. ఏ ఎంట్రీ ఎలా పోస్ట్ చేయాలో, ఏ ఓచర్ ఎలా పాస్ చేయాలో రామ్మూర్తి నడిగి తమ సందేహాలు తీర్చుకుంటుంటారు.

"ఆరోగ్యం గానీ దెబ్బతిన్నదేమో?" సందేహం వెలిబుచ్చాడు శ్రీపతి. ఈలోగా కస్టమర్లు రావడంతో ఇద్దరూ పనిలో మునిగిపోయారు.

* * *

రామ్మూర్తి ఆఫీసు కొచ్చాడు. ముఖం దిగులుగా వుంది. మనిషి నీరసించి పోయాడు.

"ఏం రామ్మూర్తీ! కులాసాయేనా?" పలకరించాడు సీతాపతి.

"ఏం కులాసా సార్! మా ఆవిడకి ఎల్లుండి ఆపరేషను."

"అరెరే! జబ్బేమిటీ?"

"రెండు కిడ్నీలూ చెడిపోయాయి సార్! ఓ పుణ్యాత్ముడు కిడ్నీ ఇవ్వడానికి సిద్ధపడ్డాడు. ఆయనకు నాలువేలు ఇవ్వాలి. ఇంకా ఆపరేషను ఖర్చులు వగైరా ఓ రెండు వేలవ్వొచ్చన్నారు డాక్టర్. ఇప్పటి వరకు ఓ నాలుగు వేలు పోగుచేయగలిగాను. ఇంకా రెండు వేలు కావాలి" రామ్మూర్తి కళ్లల్లో నీళ్లు.

"రెండు వేలే?" కళ్లు పెద్దవి చేశాడు సీతాపతి.

"ప్రాణం కంటె ముఖ్యమా బాబూ!" [illegible] రామ్మూర్తి.

"సరే! వస్తా! పనుంది" గబగబా వెళ్లిపోయాడు సీతాపతి. స్టాఫందరికీ విషయం తెల్సినట్టుంది. ఒక్కొక్కరే పరామర్శించి వెళ్తున్నారు.

బ్రాంచి మేనేజరు రామ్మూర్తిని లోపలికి పిలిపించాడు. "బ్రాంచి స్టాఫ్ దాదాపు నలభై మంది వున్నారు. తలా యాభై వేసుకున్నా ఈ అవసరం గడిచిపోతుంది. ఏమంటావ్



రామ్మూర్తీ?"

చందాలు వేసుకుని... రామ్మూర్తి ఆలోచించ లేకపోయాడు. కానీ తప్పదు. అవసరం అలాంటిది. బ్రాంచి మేనేజరు ముందుగా తను వంద రూపాయిలు ఇచ్చాడు. ఆమేరకి అందరికీ సర్క్యులర్ పంపాడు.

"పర్సు ఇంట్లో మరిచి వచ్చానోయ్. ఈ ఇరవయ్యా వుంచు" సీతాపతి ఇరవై నోటిచ్చాడు. శ్రీపతి ఇరవై ఇచ్చాడు. అందరి దగ్గరా కలెక్ట్ చేసినా పన్నెండొందలకు మించలేదు. రామ్మూర్తికి దుఃఖం ముప్పిరి గొంటోంది. ఇంకా ఎనిమిది వందలు! బి. ఎం. బాధపడ్డాడు. అవతల ప్రాణాలతో సమస్య. ఎనిమిదొందలకు చెక్ రాసి ఇచ్చేశాడు. ఆ క్షణంలో రామ్మూర్తి కళ్లల్లో మెరిసిన వెలుగు, బహుశా ఆయన జన్మలో మరచిపోలేడు. గొంతు గద్గదమై మాట పెగిలి రాలేకపోతూంటే కృతజ్ఞతగా చేతులు జోడించాడు రామ్మూర్తి.

* * *

"నా పెళ్లి సార్! మీరంతా తప్పకుండా రావాలి"- బి. ఎం.కి వెడ్డింగ్ కార్డు ఇస్తూ అన్నాడు శ్రీపతి.

"కంగ్రాట్యులేషన్స్! తప్పకుండా" నవ్వుతూ చేయి కలిపాడు.

"థాంక్యూ సార్!" అంటూ బయటకొచ్చాడు శ్రీపతి.

"ఊ! అయితే ఈ ప్రపంచంలో మరో ప్రాణి స్వేచ్ఛని కోల్పోతోందన్న మాట" నవ్వుతూ అన్నాడు సీతాపతి.

మర్నాడే పెళ్లి. అంతా కలిసి పెళ్లిలో ఇవ్వాల్సిన ప్రెజెంటేషన్ గురించి చర్చించారు. నలభై మందీ జాయింటుగా ఇస్తున్నారు కాబట్టి గిఫ్టు భారీగానే వుండాలన్న నిర్ణయాని కొచ్చారంతా. తర్జన భర్జనలయ్యాక టూ - ఇన్ - వన్ ఒకటి ఇవ్వాలని తీర్మానించారు. సాయంత్రం కల్లా అందరి దగ్గరా నలభై చొప్పున కలెక్ట్ చేశారు. సీతాపతీ మరో ఇద్దరు పెళ్లి గిఫ్టు కొన్నారు.

మర్నాడు సాయంత్రం అందంగా పేక్ చేసిన టూ - ఇన్ - వన్‌ని మోసుకుంటూ గర్వంగా తరలి వెళ్తున్న బృందాన్ని చూసిన రామ్మూర్తి పెదవులపై నిర్జీవమైన నవ్వొకటి కదలాడింది.